క్లుప్తంగా

జగనన్నకు వీఆర్వోల సంఘం కృతజ్ఞతలు

యడ్లపాడు: వీఆర్వోల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంప్లాయిస్ గ్రీవెన్స్‌తో పాటు జీవో నెంబర్: 1545,64, 658, 166,31 విడుదల చేయడం హర్షణీయం అని ఏపీ వీఆర్వో సంఘం ప్రధాన కార్యదర్శి జి అనుపమ చెప్పారు. యడ్లపాడు మండల వీఆర్వోల సంఘం అధ్యక్షులు కేపీ చారి ఆధ్వర్యంలో యడ్లపాడు మండల గ్రామరెవెన్యూ అధికారుల ప్రథమ వార్షికోత్సవ సమావేశం జరిగింది. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం మండల కార్యక్రమంలో అనుపమ మాట్లాడుతూ ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అనుబంధంగా ఉన్న వీఆర్వోల సంఘం తమ పోరాటాల్లో భాగంగా పలు జీవోలను సాధించుకున్నదన్నారు. వీఆర్వోల అభ్యున్నతి కోసం ఆయా జీవోలను విడుదల చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఆశయసాధనకు కృషి చేసిన ఏపీఆర్‌ఎస్‌ఏ అధ్యక్ష, కార్యదర్శులైన బొప్ప రాజు వెంకటేశ్వర్లు, కోన ఆంజనేయకుమార్‌లకు సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మంచినీటి చెరువుల వద్ద ఘనంగా జల్‌దీవెన్

నరసరావుపేట: జల్ దీవెన్ (నీటి దీపావళి) కార్యక్రమంలో భాగంగా మంగళవారం శాంతి నగర్ ఫిల్టర్ హౌస్, నకరికల్లు చెరువు దగ్గర నీటిని దుర్వినియోగం చేసుకోకుండా జాగ్రత్తగా వాడుకోవాలంటూ మహిళలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్, మున్సిపల్ ఇంజినీర్ కనకారావు, డీఈ ఓలేటి శ్రీనివాసరావు, ఏఈ స్వర్ణ రాజు, మెప్మా అధికారి ఓమర్, సిబ్బంది పాల్గొన్నారు.

బండ్లమోటు ఎస్ఐగా చెన్నకేశవులు

బొల్లాపల్లి : బండ్లమోటు స్టేషన్ ఎస్ఐగా డి.చెన్నకేశవులు ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో వినుకొండ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ బండ్లమోటుకు బదిలీ అయ్యారు. గతంలో బండ్లమోటు స్టేషన్ ఎస్ఐగా విధులు నిర్వహించిన జి. రవికృష్ణ చిలకలూరిపేట రూరల్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

కరాటే పోటీల్లో ద్వితీయ బహుమతి

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం గ్రామంలో గల ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి సి.హెచ్. గురుచరణ్ సాయి మహేంద్ర కరాటే పోటీల్లో 44 కేజీల విభాగంలో ద్వితీయ స్థానం సంపాదించాడని ప్రిన్సిపాల్ బి. రవినాయక్ తెలిపారు. ఈ నెల 5వ తేదీన విజయవాడలో నిర్వహించిన 22వ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పాల్గొని బహుమతి సాధించారన్నారు. బహుమతి సాధించిన గురుచరణ్ సాయి మహేంద్రను వ్యాయామ ఉపాధ్యాయులు డి.ఎస్ వీరాంజనేయులు, పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

నాదెండ్ల: నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరని గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్, విద్యాదాత నడికట్టు రామిరెడ్డి చెప్పారు. చిరుమామిళ్ళ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మన బడి నాడు నేడు ఫేజ్- 2 అదనపు గదుల నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ ఏడాది ఈ పాఠశాలకు ప్రభుత్వం మూడు అదనపు తరగతుల కోసం రూ.36 లక్షలు మంజూరు చేసిన విషయం విదితమే. వచ్చే ఏడాది నుంచి ఈ ఉన్నత పాఠశాలలో 3,4,5 తరగతులు విలీనం కానున్నాయి. ఈ నేపథ్యంలో నిర్మాణ పనులు తుదిదశకు చేరాయి. వీటితో పాటూ తన స్వంత నిధులు రూ.25 లక్షలతో మరో అదనపు గది, స్టోర్ రూం, వంట గది, ఆర్వో ప్లాంటు నిర్మాణం కోసం పనులు చేపట్టారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేసి పాఠశాల కమిటీకి అప్పగించనున్నట్లు చెప్పారు.

ఈఎన్‌టీ హాస్పిటల్‌లో అరుదైన ఆపరేషన్



నరసరావుపేట: గుంటూరురోడ్డులోని కొండవీడు ఇఎన్‌టీ హాస్పిటల్‌లో ఓ మహిళకు అరుదైన ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించి ఆమె ప్రాణాలను కాపాడారు. మంగళవారం హాస్పిటల్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం 40 ఏళ్ల మహిళ తనకు ఊపిరి అందటంలేదని, ఊపిరి తీసుకుంటే శబ్దం వస్తుందంటూ ఈనెల రెండోతేదీన తమ హాస్పిటల్‌కు వచ్చిందన్నారు. ఆమెకు ఎండోస్కోపీ పరీక్ష చేసి చూడగా శ్వాస తీసుకునే గొట్టంలో అడ్డు ఏర్పడినట్లు గుర్తించామన్నారు.శ్వాస తీసుకునే సమయంలో శ్వాసనాళం పెద్దది కావాల్సి ఉండగా సమస్య ఏర్పడిందన్నారు. దీనిని బయోలేటరల్ ఒకల్ కార్డు పాల్సీ అంటారన్నారు. ఈ సమస్య వెయ్యి మందిలో ఒకరికో, ఇద్దరికో ఏర్పడుతుందన్నారు. ఆమెకు తమ డాక్టర్లు శ్రీవర్షిణి, మోహన్‌రెడ్డి, కల్యాణ్, సుబ్బారావు విజయవంతంగా ఆపరేషన్ నిర్వహించి మూడురోజుల అనంతరం ఇంటికి పంపించటం జరిగిందన్నారు.

ఆరోగ్య శిబిరాలు సద్వినియోగించుకోవాలి

శ్రీనివాసనగర్‌లో 275 మందికి వైద్యసేవలు

నరసరావుపేట: ప్రజల ఆరోగ్యం కోసం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ఆయా ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్ పేర్కొన్నారు. మంగళవారం షాలెంనగర్ ప్రాథమిక పరిధిలోని తొమ్మిదో వార్డు శ్రీనివాసనగర్‌లో గల శ్రీ లాల్‌బహదూర్ మున్సిపల్ పాఠశాల ఆవరణలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఆయన సందర్శించారు. ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆరోగ్యాంధ్రప్రదేశ్ చూడాలనే ఉద్దేశ్యంతో సురక్ష శిబిరాలను ఏర్పాటు చేశారన్నారు. మంచి సదావకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. కాగా, శిబిరంలో మొత్తం 275 మంది ఓపీ రిజిస్టర్ చేసుకోగా వారిలో 137 మంది మహిళలు, 100 మంది పురుషులు, ఇద్దరు బాలింతలు ఉండగా 130 మంది కంటి వైద్యపరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ వెంకట్, ఆషాలత, మేఘన వైద్య సేవలు అందజేయగా వైద్యసిబ్బంది రక్తపరీక్షలు, బీపీ, మధుమేహం పరీక్షలు చేశారు. ఏవీరెడ్డి కంటి వైద్య సిబ్బంది కళ్లపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆ వార్డు మాజీ కౌన్సిలర్, గిరిజన వెల్ఫేర్ కార్పొరేషన్ డైరక్టర్ పాలపర్తి వెంకటేశ్వర్లు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



శ్రీనివాసనగర్‌లో రోగులకు రక్తపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

దొండపాడులో..

నరసరావుపేట రూరల్: మండలంలోని దొండపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న 446 మందికి శిబిరానికి హాజరు కాగా వీరిలో 242 మంది మహిళలు, 204 మంది పురుషులు ఉన్నారు. కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న 138 మందికి పరీక్షలు నిర్వహించి 56 మందికి కళ్లజోళ్లు అవసరమని సూచించారు. కోటప్పకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నందకుమార్, డాక్టర్ జోయల్ ప్రసాద్ రోగులకు వైద్య సేవలు అందించారు. ఎంపీడీవో వెంకటేశ్వరరావు, సర్పంచ్ జెక్కిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, ఎంపీటీసీ నవులూరి వెంకటేశ్వరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీరామ్, వైద్య, సచివాలయ సిబ్బంది, ఆశవర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.



శ్రీనివాసనగర్‌లో మందులు రాస్తున్న డాక్టర్ ఆషాలత



శ్రీనివాసనగర్ మందులు అందజేస్తున్న సిబ్బంది



దొండపాడు వైద్య శిబిరంలో రోగులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

దొంగనోట్ల సంస్కృతి టీడీపీదే

- అరవిందబాబు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి
- విలేకర్ల సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు

నరసరావుపేట: నియోజకవర్గంలో దొంగనోట్ల సంస్కృతి టీడీపీ వారిదేనని చరిత్ర చెబుతుందని, ఆ పార్టీ నాయకుడు డాక్టర్ చదలవాడ అరవిందబాబు ముందుగా వాస్తవాలు తెలుసుకొని ఆరోపణలు చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు సూచించారు. ఓటరు జాబితాలో ఉన్న ఓట్లు తొలగించి దొంగ ఓట్లు చేర్చుతున్నారని, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి మాతృమూర్తి దివంగత సుబ్బాయమ్మ మృతిచెంది నాలుగేళ్లు అయినా ఇంకా ఆమె పేరును ఓటరు జాబితా నుంచి తొలగించలేదని సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో అరవిందబాబు పేర్కొనడాన్ని ఖండించారు. గుంటూరు రోడ్డులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో గిరిజన, మాదిగ కార్పొరేషన్ల డైరెక్టర్లు పాలపర్తి వెంకటేశ్వరరావు, కందుల ఎజ్రా, పార్టీ జిల్లా కోశాధికారి ఎన్‌కే ఆంజనేయులు, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ ఖాదర్ బాష, మైనార్టీ జిల్లా కార్యదర్శి సయ్యద్ ఖాదర్‌బాష, మాజీ కౌన్సిలర్ మాడిశెట్టి మోహనరావు, పట్టణ బీసీసెల్ అధ్యక్షుడు అచ్చి శివకోటి, చిన తురకపాలెం నాయకుడు పాదిలే ఖాజా మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో ఓటరు సర్వే ద్వారా జరుగుతున్న ఓటరు జాబితాను అధికారులు పకడ్బందీగా నిర్వహిస్తున్నారన్నారు. ఇందులో పార్టీలు, వ్యక్తుల ప్రమేయం ఉండదన్నారు. తనతల్లి సుబ్బాయమ్మ ఓటును తొలగించాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ఈ ఏడాది జూలైలో ఎన్నికల కమిషన్‌కు చేసుకున్న దరఖాస్తు మేరకు ఆమె ఓటును అధికారులు తొలగించటం జరిగిందన్నారు. పాత ఓటరు జాబితా పట్టుకొని చదువుకున్న అరవిందబాబు ఆరోపణలు చేయటం ఆయన తెలివి తక్కువ తనానికి నిదర్శమన్నారు. తన ప్రక్కన పెయిడ్ ఆర్టిస్టులను పెట్టుకొని తప్పు డు ఆరోపణలు చేయటం మంచిది కాదన్నారు. గతంలో నాగరాజు అనే వ్యక్తి చనిపోయేందుకు ఎమ్మెల్యేనే కారణమని ఆరోపించగా అతడి భార్య అరవందబాబు చెప్పమంటేనే తాను ఎమ్మెల్యే పేరు చెప్పానని చెప్పటం ద్వారా అసలు విషయం బహిర్గతమైందన్నారు. నిత్యం ప్రజల్లో తిరుగుతూ బడుగు, బలహీన వర్గాల అభిమానం పొందిన వ్యక్తి ఎమ్మెల్యే గోపిరెడ్డి అన్నారు. టీడీపీ పుట్టిన దగ్గర నుంచి నియోజకవర్గంలో దొంగ ఓట్లతోనే గెలిచిందన్నారు. సామాజిక బస్సు యాత్ర వచ్చే 14వ తేదీన నరసరావుపేటలో జరుగుతుందనే విషయం తెలుసుకొని టీడీపీ వారు మాట్లాడాలన్నారు.

ప్రజారోగ్యానికి అండగా నిలుస్తున్న ప్రభుత్వం

ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు



నరసరావుపేట: రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని, మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని పార్లమెంట్ సభ్యులు లావు శ్రీ కృష్ణదేవరాయలు పేర్కొన్నారు. ఎంపీ చేసిన సిఫార్సు లేఖల ద్వారా 11 మందికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి రూ.10.75లక్షల చెక్కులను మంగళవారం స్థానిక ఎంపీ క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రాంతాలు

చిలకలూరిపేట: విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాలలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ డీఈఈ ఆర్ అశోక్ కుమార్ తెలిపారు. పురుషోత్తమపట్నం అంకమ్మ గుడి నుంచి ఆంజనేయ స్వామి గుడి వరకు, సాయిబాబా గుడిరోడ్డు, వాటర్ ట్యాంకర్ బజారు, బొడ్రాయి సెంటర్ ప్రాంతాలలో సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు బారికేడ్ల విరాళం



అచ్చంపేట: అచ్చంపేట మెయిన్‌రోడ్డుపై ట్రాఫిక్‌ని నియంత్రించేందుకు స్నేహహస్తాలు ఫౌండేషన్ వారు మంగళవారం ఎస్ఐ సీహెచ్ మణికృష్ణకు రూ.50 వేలు విలువచేసే 5 బారికేడ్లు, బస్సులకోసం వేచి ఉండేందుకు రెండు సిమెంట్ బల్లలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మణికృష్ణ మాట్లాడుతూ స్నేహహస్తాలు ఫౌండేషన్ విద్యాభివృద్ధికి ఎంతో కృషిచేస్తున్నారని, దానితోపాటు సమాజ శ్రేయస్సును కాంక్షిస్తూ అనేక సేవా కార్యక్రమాలను చేపట్టారని చెప్పారు. అందులో భాగంగానే ప్రమాదాలను నివారించి, ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు అడిగిన వెంటనే బారికేడ్లు విరాళంగా ఇచ్చారన్నారు. ప్రయాణికులు బస్సులకోసం వేచి ఉండేందుకుగాను రెండు సిమెంట్ బల్లలను కూడా ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో స్నేహహస్తాలు కమిటీ డైరెక్టర్ శివరామకృష్ణ, మన్నెం భద్రయ్య, కో ఆర్డినేటర్ తాయి కరిముల్లాబాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

అచ్చంపేట: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఏపీ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, గుంటూరు వారి ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా స్థాయి అండర్-19 రెజ్లింగ్(కుస్తీ) పోటీలు బాలురకు, బాలికలకు వేరువేరుగా జరిగాయి. ప్రతిభ కనబరచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికచేశారు. బాలికల విభాగంలో బాపట్లకు చెందిన పి.భూమిక, కె.సుమలత, పి.సౌమ్య, వీపీసౌత్‌కు చెందిన డి.గౌతమి, కె.భ్యూల, ఎల్.బంగారీలు ఎంపికయ్యారు. బాలురు గ్రీకో ఫ్రీస్టైల్ విభాగంలో అచ్చంపేటకు చెందిన కె.లాలునాయక్, ఎస్.వంశి, బి.విజయబాబు, బి.సాగర్‌లు ఎంపికయ్యారు. గ్రీకో రామన్ విభాగంలో అచ్చంపేటకు చెందిన కె.కిరణ్‌కుమార్, బి.మహేంద్ర, జి.ఇస్సాకు, కె.ప్రభాకర్, బి.అద్భుతకుమార్, నరసరావుపేటకు చెందిన వై.మల్లిఖార్జున, అచ్చంపేటకు చెందిన షేక్ రబ్బానిలు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 11, 12, 13 తేదీలలో కృష్ణా జిల్లా, నున్నలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారు. పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ టి.అరుణ్‌కుమార్ ప్రారంభించగా, పాఠశాల పీడీ గుడిపూడి భూషణం అంపైర్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన పలు పాఠశాలల విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నేత్రాల పట్ల అప్రమత్తత అవసరం

సత్తెనపల్లి: నేత్రాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సత్తెనపల్లి రూరల్ సీఐ పీ ప్రేమయ్య అన్నారు. ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో పట్టణంలోని 16వ వార్డు చెంచు కాలనీలో మంగళవారం పేదలకు ఉచితంగా నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అన్ని అవయవాల కన్నా కళ్ళు ముఖ్యమైనవని, కనుక ప్రతి ఒక్కరూ నేత్రాల పట్ల కనీస జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల సిబ్బంది నేత్ర పరీక్షలు నిర్వహించి 62 మందికి కళ్ళజోళ్ళు అందించారు. కార్యక్రమంలో ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల ఇన్‌చార్జ్ సత్యనారాయణ, చర్చి ఫాదర్ పి.విజయ్ కుమార్, 16వ వార్డు మాజీ కౌన్సిలర్ నందిగం ఆదాం, ఫ్రెండ్స్ సోషల్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు తోట ఆంజనేయులు, తదితరులు ఉన్నారు.

టికెట్ కౌంటర్, గేటు ఏర్పాటు చేయించండి

నరసరావుపేట: స్థానిక రైల్వేస్టేషన్‌లో ప్రకాష్‌నగర్ వైపు టిక్కెట్ కౌంటర్, గేటు ఏర్పాటుచేయాలని పట్టణ వినియోగదారుల సంక్షేమ సంఘ ఉపాధ్యక్షుడు కుంచాల స్వామి కోరారు. ఈ మేరకు మంగళవారం ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలకు వినతి పత్రం సమర్పించారు. గుంటూరు-నంద్యాల మార్గంలో రైల్వేలైను విద్యుద్దీకరణ, డబుల్‌లైన్ ఏర్పాటు చేయటంతో పాటు రైల్వేస్టేషన్‌ను ఆధునీకరిస్తున్నారన్నారు. వృద్ధులు, వికలాంగులు, చిన్న పిల్లలు పట్టాలు దాటి ఒక ప్లాట్‌ఫాం నుంచి రెండో ప్లాట్‌ఫాంకు సురక్షితంగా వెళ్లేందుకు లిఫ్ట్ సౌకర్యం కల్పించాలని కోరారు. రైల్వే ఉన్నతాధికారులతో చర్చించి ఏర్పాట్లు చేయించాలని ఎంపీని కోరారు.


ఓట్ల తొలగింపులో బీఎల్‌వోలు ప్రత్యేక దృష్టి సారించాలి

రొంపిచర్ల: మండలంలోని అన్ని పోలింగ్ స్టేషన్‌లలో చనిపోయిన ఓట్ల తొలగింపులో బీఎల్‌వోలు ప్రత్యేక దృష్టి సారించాలని తాహసీల్దార్ జి.అంకారావు అన్నారు. మండలంలోని బుచ్చిబాపన్నపాలెం, రొంపిచర్ల, సంతగుడిపాడు, కర్లకుంట, నల్లగార్లపాడు గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఆయా పోలింగ్ స్టేషన్‌ల పరిధిలోని బీఎల్‌వోలకు సూచనలు చేశారు. మరణించిన ఓటర్లతో పాటు రెండు చోట్ల ఓట్లు ఉన్నవారిని గుర్తించాలన్నారు. చనిపోయిన ఓటర్ల బంధువుల చేత డిక్లరేషన్‌ను తీసుకొని వారి ఓట్లను తొలిగించాలన్నారు. రెండు చోట్ల ఓట్లు ఉన్న వారందరికీ వారికి అవసరమైన చోట ఓటు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. చనిపోయిన వారి ఓట్లను తొలగించేందుకు ఆయా కుటుంబాల సభ్యులు సహకరించాలన్నారు. ఓట్ల చేర్పులు, మార్పులు, తొలగింపుల విషయంలో బీఎల్‌వోలు విచారణ చేయడంలో అలసత్వం వహించవద్దన్నారు.

గ్రామకంఠాల్లో ఆస్తుల పత్రాలు అందజేయండి

నరసరావుపేట: జిల్లాలోని అన్నీ గ్రామ పంచాయతీల్లో నిర్వహిస్తున్న స్వమిత్వ సర్వేలో యజమానులు తమ ఆస్తికి చెందిన పత్రాలను అందజేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఎంవీ భాస్కరరెడ్డి మంగళవారం కోరారు. గ్రామ కంఠంలో ఆస్తులను తెలుసుకునేందుకు గ్రౌండ్ ట్రూతింగ్ నోటీసులు జారీ చేసిన సమయంలో యజమానులు దగ్గర ఉండి తమకు చెందిన ఆస్తులు, వ్యక్తిగత ఇళ్లు, స్థలాల ధృవీకరణ పత్రాలు అందజేయాలన్నారు.

సామాజిక సాధికార బస్సు యాత్రకు..



ఈపూరు: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో వినుకొండ పట్టణంలో మంగళవారం చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రకు ఈపూరు మండలం నుంచి పార్టీ శ్రేణులు వేలాది మందిగా తరలివెళ్లారు. సుమారు 60 వాహనాల్లో 5 వేల మంది కార్యకర్తలు ఈ యాత్రకు జగనన్నకు జేజేలు పలుకుతూ బయలుదేరి వెళ్లినట్లు మండల పార్టీ అధ్యక్షులు కోపెల దేవరాజ్ తెలిపారు. ఇనిమెళ్ల, ముప్పాళ్ల, కొచ్చర్ల, కొండ్రముట్ల, ఈపూరు గ్రామాల నుంచి అత్యధికంగా వెళ్లినట్లు దేవరాజ్ పేర్కొన్నారు.

నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు

డిప్యూటీ డీఈవో వేణుగోపాల్

శావల్యాపురం: రానున్న పదవ తరగతి పరీక్షలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత శాతం సాధించేలా చర్యలు చేపట్టామని నరసరావుపేట డివిజన్ డిప్యూటీ విద్యాశాఖాధికారి కె.వేణుగోపాల్ అన్నారు. మంగళవారం మండలంలోని మతుకుమల్లి గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాలను డిప్యూటీ డీఈవో వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఈవో మాట్లాడుతూ డివిజన్ పరిధిలో 150 స్కూల్ ఉన్నాయని ప్రతి స్కూలు వార్షిక తనిఖీ చేస్తామన్నారు. వార్షిక తనిఖీ చేసే పాఠశాలల్లోని ఉపాధ్యాయులు బోధన తీరు మౌలిక వసతులు ప్రభుత్వం అందించే వసతులు విద్యార్థులకు అందుతున్నాయా తదితర వాటిని క్షుణ్ణంగా పరిశీలించి ఉపాధ్యాయులకు తగు సూచనలు చేశామన్నారు. ఉదయం 9 గంటల నుంచి ఏడు మంది ప్రధానోపాధ్యాయుల సారథ్యంలో సబ్జెక్టు వారీగా తనిఖీ చేసినట్లు చెప్పారు. ఈనెల 15 నుంచి పదోవ తరగతి విద్యార్థులకు సమ్మేటివ్ ఎసెస్‌మెంటు పరీక్షలు జరుగుతాయని ఇందులో మార్కులు ఆధారంగా విద్యార్థులను గ్రేడులుగా విభజించి మంచి ఫలితాల సాధనకు కృషి చేస్తామన్నారు. ఈ విద్యా సంవత్సరంలో శావల్యాపురం హైస్కూల్లో నూతనంగా బాలికల జూనియర్ కళాశాల ప్రారంభమైందని త్వరలో సందర్శించి నూరుశాతం ఉత్తీర్ణత శాతం పెరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రధానోపాధ్యాయులు కృషి తులసి ఉపాధ్యాయులు, సీఆర్‌పీ ఏలికా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న వేణుగోపాల్

నైపుణ్యం చూపి మంచి పేరు తేవాలి

- గుంటూరు కళాపరిషత్ నిర్వాహకులు ఆలోకం పెద్దబ్బయ్య
- లింగారావుపాలెం జెడ్పీహైస్కూల్ విద్యార్థులకు అభినందనలు

యడ్లపాడు: క్రీడల పట్ల ఆసక్తి.. పోటీల్లో నైపుణ్యం చూపి కన్నవారికీ ఉన్న ఊరికి మంచిపేరు తీసుకురావాలని గుంటూరు కళాపరిషత్ నిర్వాహకులు ఆలోకం పెద్దబ్బయ్య కోరారు. లింగారావుపాలెం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలోని జెడ్పీహైస్కూల్ విద్యార్థుల అభినందన సభలో ఆయన పాల్గొన్నారు. ఇటీవల రోటరీక్లబ్ ఆధ్వర్యంలో చిలకలూరిపేట నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో పాఠశాల విద్యార్థులు ప్రథమస్థానాన్ని కై వసం చేసుకున్నారు. అలాగే మరో విద్యార్థినులు రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో జిల్లా జట్టు తరుపున పాల్గొనేందుకు అర్హత సాధించారు. ఆయా క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభను చాటిన క్రీడాకారులను, వారికి తర్ఫీదు నిచ్చిన పీఈటీ మేరీశారీను పాఠశాల ప్రాంగణంలో అభినందించారు. ఈ సందర్భంగా విజేతలకు రూ.20 వేల విలువైన క్రీడా దుస్తులతో పాటు రూ.6 వేల నగదును అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం కేవీ రామిరెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యులు ఆలోకం లక్ష్మీ ప్రసాద్, నంబూరు శివ రామకృష్ణయ్య, తోకల సత్యనారాయణ, పీఎం కమిటీ చైర్మన్ షేక్ మీరావలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు దుస్తులు, నగదుల అందించిన లింగారావుపాలెం గ్రామ అభివృద్ధి కమిటీ

విద్యుత్ శాఖ విజిలెన్స్ విస్తృత తనిఖీలు

రూ.7.25 లక్షలు అపరాధ రుసుం వసూలు

రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు, విప్పర్ల, రెడ్డిపాలెం, అన్నవరం గ్రామాల్లో మంగళవారం విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 196 మందికి రూ.7.25 లక్షలు అపరాధ రుసుం విధించామని ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్. శ్రీనివాసరావు తెలిపారు. 46 మంది అధికారులు, 138 మంది సిబ్బందితో 46 బృందాలుగా ఏర్పడి 2397 సర్వీసులను తనిఖీ చేసినట్లు చెప్పారు. అనుమతించిన లోడ్ కంటే అదనంగా విద్యుత్‌ను వాడుతున్న 137 మందికి రూ.6.14 లక్షలు, మీటర్ లేకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 45 మందికి రూ.70 వేల రూపాయలు, మీటర్ ఉండి అక్రమంగా విద్యుత్ చౌర్యం చేస్తున్న 5 మందికి రూ.15 వేల రూపాయలు, అనుమతించిన క్యాటగిరీ కాక ఇతర క్యాటగిరీల్లో విద్యుత్ వాడుకుంటున్న 9 మందికి రూ.26 వేల రూపాయలు అపరాధ రుసుంగా విధించామన్నారు. అపరాధ రుసుం చెల్లించని వారిపై కేసు నమోదు చేస్తామన్నారు.

అపరాధ రుసుం కట్టలేని పరిస్థితుల్లో రెవెన్యూ రికవరీ చట్టం ఉపయోగించి ఆస్తులు జప్తు చేస్తామన్నారు. విద్యుత్ చౌర్యం సామాజిక నేరం అన్నారు. విద్యుత్ చౌర్యంపై ఫిర్యాదులు చేస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. విజిలెన్స్ దాడులలో డిఈఈలు ఎం.రవికుమార్, బి. వెంకటేశ్వరరెడ్డి, కె.రవికుమార్, ఏఈలు కె. రాంబాబు, ఎ. చంద్రశేఖర్, కె. కోటేశ్వరరావు పలువురు అధికారులు పాల్గొన్నారు.



తనిఖీల్లో పాల్గొన్న విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు

వినికిడి లోపంతో ఎవరూ ఇబ్బంది పడకూడదు

- డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్‌లో కాక్లియర్ ఇంప్లాంట్ స్పీచ్ పరికరాలను ప్రారంభించిన కలెక్టర్
- సీఎంఆర్ రిలీఫ్ ఫండ్, ఆరోగ్యశ్రీ ద్వారా నలుగురికి ఉచితంగా ఆపరేషన్లు

నరసరావుపేట: జిల్లాలో వినికిడి లోపంతో ఎవరు ఇబ్బంది పడకుండా చేయడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని సత్తెనపల్లి రోడ్డులోగల డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్‌లో వినికిడి లోపం ఉన్న నలుగురు పిల్లలకు సంబంధిత కాక్లియర్ ఇంప్లాంట్ పరికరాలను ఏర్పాటుచేసే ప్రక్రియను కలెక్టర్ ప్రారంభించారు.

ఈసందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిల్లలు జన్యుసంబంధం, మేనరిక వివాహాల కారణంగా పుట్టుకతోనే మూగ, చెవుడుతో పుడుతుంటారన్నారు. వీరందరూ హాస్పిటల్‌ను సంప్రదించటంతో సీఎం రిలీఫ్ ఫండ్, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఎంతో ఖర్చుతో కూడిన ఆపరేషన్ చేసి వినికిడి పరికరాలను అందజేశారన్నారు. ఏపీలో ఇటువంటి ఆపరేషన్లు నిర్వహించే ఐదారు హాస్పిటళ్లలో జిల్లాలోని అంజిరెడ్డి హాస్పిటల్ ఒకటి కావటం పల్నాడు ప్రజల అదృష్టమన్నారు. విజయవాడకు చెందిన రక్షిత, షేక్ రఫీ అనే బాలబాలికలు, కొత్తగూడెంకు చెందిన సందీప్, నరసరావుపేటకు చెందిన రవిశేఖర్‌కు కాంక్లియర్ ఇంపాక్ట్ చేయటం జరిగిందన్నారు. వీరిలో ఇద్దరు పిల్లలకు రెండు చెవులు వినపడకపోవటంతో ఆపరేషన్లు చేశారన్నారు. ఒక్కొక్క చెవికి రూ.8 లక్షలు చొప్పున సుమారు రూ.16 లక్షలు వ్యయమయ్యాయన్నారు. సీఎంఆర్ రిలీఫ్ ఫండ్, ఆరోగ్యశ్రీ ద్వారా వీరికి ఉచితంగా ఆపరేషన్లు చేశారన్నారు. వైద్యరంగంలో నరసరావుపేటను అగ్రగామిగా చేయాలనే ఉద్దేశ్యంతో ఆపరేషన్లు చేసిన ఈఎన్‌టీ డాక్టర్లు రాజేష్, రజిత, ఆడియాలజిస్టు శ్రీధర్‌లను అభినందించారు. గతేడాది నుంచి ఇప్పటివరకు 20మందికి ఆపరేషన్లు చేపించుకున్నారన్నారు. విజయవాడ నుంచి కాంక్లియర్ ఆపరేషన్ల కోసం ఈ హాస్పిటల్‌కు రావటం వారి సమర్థతకు నిదర్శనమన్నారు. ప్రభుత్వానికి సహకరించిన హాస్పిటల్ యాజమాని డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాసరెడ్డిని అభినందించారు. డాక్టర్లు, వినికిడి లోపముగల పిల్లలు, వారి తల్లి దండ్రులు పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, ఎండీ శ్రీనివాసరెడ్డి